క్లుప్తంగా

హోమ్ ఓటింగ్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీమోహన్‌రావు

మాకవరపాలెం: హోమ్ ఓటింగ్‌పై ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌తోపాటు హోమ్ ఓటింగ్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీటీ శంకర్రావు, ఎస్‌ఐ రామకృష్ణారావు, సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



డివైడర్‌పైకి దూసుకుపోయిన కారు

మాకవరపాలెం: తామరం జంక్షన్‌లో రోడ్డు డివైడర్‌పైకి కారు దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. విశాఖ వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న కారు బుధవారం అర్ధరాత్రి తామరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి ఎక్కేసింది. డివైడర్లకు ఎలాంటి హెచ్చరిక బోర్డులు కాని, రేడియం స్టిక్కర్లు కాని లేవు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న మరో వాహనం లైట్ల వెలుగులో డివైడర్ కనిపించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కారు ఇంజిన్ భాగం దెబ్బతింది.

6 మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

చోడవరం రూరల్: ఆరు మండలాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం నిలుపుదల చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ చోడవరం ఏడీఈ ఉప్పలూరి కుమార్ గౌరీప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. చీడికాడలోని 132 కె.వి. సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ నిమిత్తం ఏపీ ట్రాన్స్‌కోవారు సరఫరా నిలిపివేస్తున్నందున, ఆరు మండలాలకు అసౌకర్యం కలగనుందన్నారు.

కొమరవోలు ఫీడర్ పరిధిలో...

రోలుగుంట: నర్సీపట్నం సబ్ డివిజన్ కొమరవోలు విద్యుత్తు ఫీడర్ పరిధిలో లైను మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలుపుదల చేస్తున్న ఈఈ వివి రామకృష్ణారావు తెలిపారు. కె.నాయుడుపాలెం, భోగాపురం, కొంతలం, కె.అడ్డసరం, అంట్లపాలెం, కంచుగుమల, శరభవరం, కొవ్వూరు, నాయుడుపాలెం, కె.కొత్తూరు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు.

మద్యం విక్రేతలపై కేసులు

బుచ్చెయ్యపేట: మండలంలో ఏడు గ్రామాల్లో మద్యం, సారా అమ్మకంపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. గురువారం బుచ్చెయ్యపేట పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమష్టిగా పలు గ్రామాల్లో మద్యం అమ్మకాలపై దాడులు చేశారు. గున్నెంపూడి, పెదమదీన, చిన అప్పనపాలెం, కేపీ అగ్రహారం, పెదపూడి, తురకలపూడి, గొల్లకొంపలు గ్రామాల్లో మద్యం విక్రేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

చీడికాడ: దండిసురవరంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సాయమందించారు. ఇటీవల గ్రామానికి చెందిన బత్తిన గంగరాజు కుటుంబం అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించినట్లు సంఘ సభ్యులు పెంకి శివ, గోపి, వీర్రాజు, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, తలుపులయ్య తెలిపారు.

టీడీపీకి ఓటేస్తే ఉపాధి పనులు కరువు

- గత పాలనలో నీరు – చెట్టు పేరుతో నిధుల దోపిడీ
- ఉపాధి కూలీలను కలిసిన చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



చోడవరంలో ఓటు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ



గున్నెంపూడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: నియోజకవర్గంలో నాలుగేళ్లుగా కనిపించని కూటమి అభ్యర్థి ఎన్నికల సమయంలో ఓట్లు కోసం జనంలోకి వస్తున్నారని, వారిని నమ్మి గెలిపిస్తే పాత కష్టాలు తప్పవని వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన గున్నెంపూడి చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ పాలనలో ఆపార్టీ నేతలు వేతనదారులకు ఉపాధి పనులు లేకుండా పొట్టకొట్టారని ధ్వజమెత్తారు. నీరు – చెట్టు పేరుతో చెరువులను ధ్వంసం చేసి, ఇష్టానుసారంగా ఉపాధి నిధుల్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. వీటితోపాటు రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ స్తామని, ఇంటికొక ఉద్యోగం, రూ.2 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని గద్దె నెక్కిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అందరికీ పంగనామం పెట్టాడని విమర్శించారు. బ్యాంకుల్లో బంగారు నగలు విడిపించి ఇస్తామని చెప్పి మహిళల్ని నమ్మక ద్రోహం చేశాడన్నారు. మరలా టీడీపీ ప్రభుత్వం వస్తే జగనన్న అందిస్తున్న అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, చేయూత, నాడు నేడు పనులుతోపాటు ఇంటికొచ్చి అందించే పింఛన్, బియ్యం సరఫరా నిలిచి పోతుందన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్ ముచ్చకర్ల హరిణి అప్పారావు, ఎంపీటీసీ సుశీల వెంకట రమణ, నాయకులు కె.వి.ఆర్. నాయుడు, కాసులమ్మ, తాతారావు పాల్గొన్నారు.

చోడవరంలో హోరెత్తిన ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రచారం

చోడవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి చోడవరం పట్టణ ప్రజలంతా నీరాజనం పట్టారు. పట్టణంలో కోఆపరేటివ్ కాలనీ, బాలాజీ నగర్ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి అక్కడ నుంచి ప్రచారాన్ని ప్రారంభించగా పెద్ద సంఖ్యలో యువకులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. ఐదేళ్లలో చోడవరం పట్టణంలో పూర్తిగా మంచినీటి సమస్య పరిష్కరించానని, ఎంతో ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలన్నీ అభివృద్ధి చేశానని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. వలంటీర్లను పని చేయకుండా చంద్రబాబునాయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్లే పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలనంతరం మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల ద్వారానే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో వార్డు మెంబరు కందర్ప మాధురీశంకర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గ శ్యామల, ఎంపీపీ గాడి కాసు, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవానీ, మహిళా అధ్యక్షురాలు యర్రా దేవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి వద్దాది నర్సింహమూర్తి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



చోడవరం పట్టణం కోఆపరేటివ్‌కాలనీలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం

జోరుగా ధర్మశ్రీ కుమార్తె స్వాతి ఎన్నికల ప్రచారం

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి ఎన్నికల ప్రచారం రెండో రోజు గురువారం కొనసాగింది. కొమరవోలులో ఆవ అభివృద్ధి పనులు చేస్తున్న కూలీలను ఈ సందర్భంగా ఆమె కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బీద, బడుగు వర్గాల కోసం రూపకల్పన చేసిన సంక్షేమాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ, వర్గం, కులం ఏదైనా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్ అందించడం ఎంతో ఆనందదాయకం అన్నారు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో జన్మభూమి కమిటీలతో తమ అనుయాయులకు సంక్షేమ పథకాలు మంజూరయ్యే పరిస్థితి ఉండేదన్నారు. ఎంతోమంది అర్హత ఉన్నా పథకాలు మంజూరుగాక నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా మొండిచేయి చూపేవారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, వారి ద్వారా ఏ కార్యాలయం చుట్టూ తిరగకుండానే ఇళ్లకు వచ్చి దరఖాస్తులు పూర్తి చేసి సంక్షేమ పథకాలు మంజూరు చేయించడం చరిత్రాత్మకమన్నారు. ఇంటికే వచ్చి తలుపు తట్టి నేరుగా పింఛన్లు అందిస్తుండటం దేశంలో మరే రాష్ట్రంలో లేదన్నారు. రుణాలు, రైతు భరోసా తదితర పథకాలు నేరుగా లబ్ధిదారు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో మేలైన పాలన అందుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకుని సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీకి, ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడికి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని కోరారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాచిలి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కొమరవోలులో కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ కుమార్తె స్వాతి

సీఎం బహిరంగ సభ వాయిదా

చోడవరం: ఈనెల 20న చోడవరంలో జరగనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ వాయిదా పడిందని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం తెలిపారు. మరలా బస్సుయాత్ర షెడ్యూల్‌లో మార్పుల అనంతరం సీఎం జగన్ చోడవరం ఎప్పుడు వస్తారన్నది తేదీ ఖరారవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా సహకరించాలని కోరారు.

8 గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా



చోడవరం గోవాడ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న 12 మంది వలంటీర్లు



బుచ్చెయ్యపేట: రాజీనామా పత్రాలను చూపుతున్న వడ్డాది వలంటీర్లు



రావికమతం: రాజీనామా లేఖలు చూపుతున్న గర్నికం వలంటీర్లు



బుచ్చెయ్యపేట: రాజీనామా పత్రాలతో దిబ్బిడి వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందిస్తున్న వెంకటరాజుపురం వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందజేస్తున్న కలిగొట్ల వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందజేస్తున్న తామరబ్బ వలంటీర్లు



బుచ్చెయ్యపేట: రాజీనామా పత్రాలను సెక్రటరీకి అందిస్తున్న పీడీ పాలెం వలంటీర్లు

చోడవరం/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/రావికమతం: టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయడంతో మనోవేదనకు గురైన పలువురు వలంటీర్లు గురువారం తమ బాధ్యతలకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఇప్పటి వరకు జగనన్న ఆశయం కోసం పని చేసిన తాము, ఇకపై జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు సైనికులుగా కష్టపడి పనిచేస్తామని స్పష్టం చేశారు.

- చోడవరం మండలం గోవాడ గ్రామ సచివాలయానికి చెందిన 12 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవో సత్యమణి, పంచాయతీ సెక్రటరీకి అందజేశారు.
- బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, దిబ్బిడి, పొట్టిదొరపాలెం గ్రామాల వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ సెక్రటరీలు లవరాజు, నాగేశ్వరరావుకు, ఎంపీడీవో వెంకటాచార్యకు అందజేశారు.
- దేవరాపల్లి మండలంలో వెంకటరాజుపురంలో 9 మంది వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్‌కు, కలిగొట్లలో 15 వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ ప్రసాద్‌కు, తామరబ్బలో 8 మంది వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్నకు రాజీనామా పత్రాలను అందజేశారు.
- రావికమతం మండలం గర్నికంలో 8 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా లేఖలను ఎంపీడీవో భానోజీరావుకు అందజేశారు.

తొలి రోజు రెండే నామినేషన్లు

నర్సీపట్నం: నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి తొలి రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో హెచ్.వి.జయరాం తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా న్యాయవాది బయపురెడ్డి భద్రాచలం, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నాగరాజు బొట్టా నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. వీరు ఎలాంటి ఆర్భాటం లేకుండా నామినేషన్లు దాఖలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఆర్డీవో కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చోడవరంలో నిల్

చోడవరం: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజు చోడవరం నియోజకవర్గ స్థానానికి ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో చిన్నికృష్ణ పర్యవేక్షణలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు.



మాడుగుల కార్యాలయంలో ఆర్వో సత్యవాణి

మాడుగులలోనూ అంతే..

మాడుగుల: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మాడుగుల నియోజకవర్గం నుంచి ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి జి. వి. సత్యవాణి గురువారం తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఇక్కడ తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో కార్యాలయం ఏర్పాటు చేశారు.

ఓటమికి భయపడి అభ్యర్థిని మార్చిన టీడీపీ

- మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీదే గెలుపు
- మేడిచర్లలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారం



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అనురాధ



మేడిచర్లలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న అనురాధ

కె.కోటపాడు: మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని, ఇక్కడ తనపై ఓడిపోతామన్న భయంతో టీడీపీ అభ్యర్థిని మార్చారని ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ విమర్శించారు. గురువారం రాత్రి మేడిచర్లలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టరు ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబుల ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన అనురాధకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోని మేడిచర్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోట్లాది రూపాయలతో గ్రామ రూపురేఖలు మార్చామన్నారు. మేడిచర్ల మీదుగా సూరెడ్డిపాలెం, పైడంపేట, కొత్తపెంట, గొర్రుపోటువానిపాలెం గ్రామాల లింక్‌రోడ్లను తారురోడ్లుగా మార్చామన్నారు. సీఎం జగన్ బలపర్చిన ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడుకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ రాజేశ్, ఆకుల సాయిప్రసాదు, వర్రె రామునాయుడు, గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, చీపురుపల్లి అచ్చిబాబు, ఆదిరెడ్డి రామునాయుడు, శ్రీకాంత్ శ్రీను పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడిని గెలిపిస్తే కొడుకు రౌడీయిజం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- గడపగడపలో అపూర్వ ఆదరణ



ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్



పార్టీ శ్రేణుల మధ్యలో నుంచి ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఇవే చివరి ఎన్నికలని మొరపెట్టుకునే అయ్యన్నపాత్రుడిని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఓటర్లను కోరారు. మున్సిపాలిటీలోని 27వ వార్డు శివపురం, 11వ వార్డు పెదబొడ్డేపల్లి థెరిసా కాలనీలో గురువారం ఆయన పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఇవే చివరి ఎన్నికలనటం అయ్యన్నకు పరిపాటిగా మారిందన్నారు. ఆయనతో పాటు తనయుడు విజయ్‌ను నమ్ముకుంటే నర్సీపట్నాన్ని సర్వనాశనం చేస్తారన్నారు. తాను ఏ ఇంటికి వెళ్లినా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. మహిళా మేలుకో, యువశక్తి పేరుతో అయ్యన్నపాత్రుడు మహిళల కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మాటిచ్చి ఎంత మందివి మాఫీ చేశారో సమాధానం చెప్పాలన్నారు. జాబు కావాలంటే బాబు రావాలని ఓట్ల గాలం వేసి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. పొరపాటున అయ్యన్నపాత్రుడుకు ఓటేస్తే కొడుకు విజయ్ రౌడీయిజంతో ప్రశాంతత లేకుండా చేస్తాడని హెచ్చరించారు. ప్రజలు ఆలోచించి మరోసారి తనను ఎమ్మెల్యేగా ఆదరిస్తే అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిచారు. తొలుత ప్రతీ గడపలో మహిళలు పూల వర్షం కురిపించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. జగనన్న అమ్మఒడి సూపర్ హిట్.. జగనన్న రైతు భరోసా సూపర్ హిట్.. పాటకు అమ్మాయిలు డాన్స్ ఆదరగొట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, వార్డు ఇన్‌చార్జి కొణతాల వరలక్ష్మి, వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, కర్రి రామ్‌గోపాల్, మీసాల సత్యనారాయణ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: నిండుగొండ కూడలి సమీపంలో సాయినాథుని మందిరం 21వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 05:15 గంటలకు కాగడ హారతితో ఈ ఉత్సవం ప్రారంభమైంది. 08:10 గంటలకు బాబా వారికి పంచామృత అభిషేకం చేశారు. స్థానికులతోపాటు కొవ్వూరు, వెలంకాయపాలెం, కొమరవోలు తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించుకోవాలి

- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ సతీమణి కళావతి
- పాలకపాడులో ఎన్నికల ప్రచారం



పాకలపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కళావతి

గొలుగొండ: ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చి, అభివృద్ధితోపాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి కోరారు. గురువారం సాయంత్రం పాకలపాడులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో అడుగడుగునా మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు నూరుశాతం అందించారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీరు వ్యవస్థతో స్వర్ణయుగ పాలన ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. పార్టీలు,కులాలు చూడకుండా అర్హతే కొలమానంగా ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అందించారన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ప్రజా సంక్షమమే ధ్యేయంగా పనిచేశారని తెలిపారు. వీరి సేవలను గుర్తించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా గెలిపించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ, సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీశాంతారామ్, సర్పంచ్ రాజాన పద్మ, ఎంపీటీటీ యాళ్ల లక్ష్మీదుర్గా, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



పరామర్శిస్తున్న ఎంపీ అభ్యర్థి బూడి

చీడికాడ: ద్వారపూడి వెంకటరమణ(47) కుటుంబానికి అండగా నిలుస్తామని డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గురువారం అర్జునగిరిలో గుండెపోటుతో మృతి చెందిన వెంకటరమణ మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుమారుడిని ఓదార్చారు. సర్పంచ్ బి.రమాశ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు పెంటకోట నూకునాయుడు, నాయకులు కోవిలపల్లి పైడిబాబు, పరువాడ నాయుడు, అగ్రవు చిన్నంనాయుడు, తంగేటి అప్పలనాయుడు, చీకటి శివ, మైచర్ల బుజ్జి, మోసూరి సింహాచలంనాయుడు, అద్దెపల్లి ఈశ్వరరావు, నర్సింహమూర్తి, కొల్లి నాని, మంకు సూరిబాబు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆట పాటలు



విద్యార్థినితో లెక్కలు చేయిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: విద్యార్థులకు బోధనతోపాటు ఆట పాటలు నేర్పించాలని ఎంపీడీవోజాగరపు రాంబాబు తెలిపారు. ఎం.బి.పట్నం హైస్కూల్ ఎలిమెంటరీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతమంది విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. తర్వాత మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఇక్కడ ప్రధాన సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంతోపాటు గన్నవరంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ ఎన్నికల చెక్ పోస్టును సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు చినబాబు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిస్థితి తెలియజేయాలి

నాతవరం: నామినేషన్ల సమయంలో నాయకులు మధ్య వివాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, క్షేత్రస్థాయి పరిస్థితిపై ఎప్పుకప్పుడు తెలియజేయాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. డీటీ సురేష్ నామినేషన్ల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.